గుక్కెడు నీటికీ కరువే!

- శాలిగౌరారంలో ఎండిపోయిన గ్రామపంచాయతీ బోరు
- 15 రోజులుగా అందని తాగునీరు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న మండల కేంద్ర ప్రజలు

శాలిగౌరారం: మండుతున్న ఎండలు.. ఎండుతున్న బోర్లు.. ఫలితంగా చుక్క నీరులేక తల్లడిల్లుతున్న జనం.. ఇదీ శాలిగౌరారం మండలకేంద్రం పరిస్థితి. మండలకేంద్రంలో 15 రోజులుగా మంచినీటి సమస్య ఏర్పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అష్టకష్టాలు పడుతూ ఇళ్లలోకి అడపాదడపా వచ్చే మిషన్ భగీరథ తాగునీటితోనే కాలం వెళ్లదీసుకుంటున్నారు. నీటి వినియోగం ఎక్కువగా ఉన్న వారు సమీపంలోని వ్యవసాయ బావుల వద్దనుంచి ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలపై నీటిని తెచ్చుకుంటూ అవసరాలను తీర్చుకుంటున్నారు.


శాలిగౌరారం మండల కేంద్రంలో ఎండిపోయిన తాగునీటి బోరు

ఎండిపోయిన గ్రామపంచాయతీ బోరు

గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని నకిరేకల్ రోడ్డువెంట 200 అడుగుల బోరు వేసి దాని ద్వార దశాబ్ద కాలంగా తాగునీటిని అందిస్తున్నారు. 15 రోజుల క్రితం పూర్తిగా ఎండిపోవడంతో చుక్కనీరు రాకుండా పోయింది. దీంతో ఈ బోరు పరిధిలోని ఇళ్లు, వ్యాపార దుకాణాల ప్రజలు నీటి సౌకర్యం లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే ఉన్న బోరు పూర్తిగా ఎండిపోవడం.. ప్రత్యామ్నాయ బోరు లేకపోవడం.. ఎండలు మరింతగా ముదురుతుండటంతో నీటి సమస్యపై ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వివిధ పనులపై మండలకేంద్రానికి వచ్చిన ప్రజలు తాగునీరు లేకపోవడంతో దుకాణాల్లో కొనుగోలు చేసి దాహార్తిని తీర్చుకుంటున్నారు.

తాగునీటి సమస్య తీర్చాలి:

మిర్యాల గణేశ్, శాలిగౌరారం

మండలకేంద్రంలో గ్రామపంచాయతీకి చెందిన బోరు ఎండిపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. తాగునీటి సమస్యను తీర్చేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. నీటి కోసం నానా అవస్థలు పడుతున్నాం. మరోచోట కొత్తగా బోరు వేసి తాగునీటి సమస్య తీర్చాలి.

'మిషన్' నీటిని సరిపడా అందించాలి



15 రోజులుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ట్రాక్టర్లపై నీటిని తెచ్చుకొని అవసరాలు తీర్చుకుంటున్నాం. మిషన్ భగీరథ తాగునీరు పావుగంటకు మించి రావడం లేదు. మిషన్ భగీరథ నీటిని రెండు విడుతలుగా సరిపడా విడుదల చేసి సమస్యను తీర్చాలి.

– గుజిలాల్ రమణ, శాలిగౌరారం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



గ్రామపంచాయతీ బోరు ఎండిపోయిన విషయన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కొత్తగా మరోచోట బోరువేసేందుకు పంచాయతీలో నిధులు లేవు. ఎన్నికల కోడ్ కావడంతో విషయాన్ని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకుపోలేక పోతున్నాం. ప్రస్తుతం పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేస్తున్నాం.

– విజయ్, గ్రామపంచాయతీ కార్యదర్శి, శాలిగౌరారం

క్లుప్తంగా

ఎర్ర జెండాలు ఆవిష్కరించాలి

నల్లగొండ టౌన్ : ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా అన్ని యూనియన్లు కార్మిక వాడల్లో ఎర్ర జెండాలను ఆవిష్కరించి ప్రదర్శనలు నిర్వహించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తుమ్మల వీరారెడ్డి, చిన్నపాక లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మేడే స్ఫూర్తితో కార్మిక వర్గ ఐక్యత సాధిస్తూ మత తత్వ విధానాలు అవలంబిస్తున్న బీజేపీని ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించడానికి సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, జిల్లా నాయకులు జిట్ట నగేష్, ఒంటెపాక వెంకటేశ్వర్లు, అద్దంకి నరసింహ, సలివోజు సైదాచారి, రమేష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని తగ్గించేందుకు కుట్ర


కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

నకిరేకల్ : కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని క్రమక్రమంగా తగ్గించాలని కుట్ర పన్నుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. నకిరేకల్ మండలం కడపర్తి గ్రామంలో సీపీఎం ఎంపీ అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ ఆయన గురువారం ఉపాధి హామీ కూలీలను కలిసి మాట్లాడారు. 35 ఏళ్ల నుంచి ప్రజాసమస్యలపై పోరాడుతున్న జహంగీర్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కందాల ప్రమీలా, రాచకొండ వెంకట్‌గౌడ్, శేఖర్, కర్నె పరమప్ప పాల్గొన్నారు.

గుడి నిర్మాణానికి విరాళం అందజేత


విరాళం అందజేస్తున్న శ్రీనివాస్

చిట్యాల: మండలంలోని చిన్నకాపర్తి గ్రామంలో నిర్మించనున్న వడ్డెరుల కులదైవం ఈదమ్మ తల్లి గుడి నిర్మాణానికి ఆ గ్రామానికి చెందిన ఇమడలపాక భిక్షపతి–సత్తమ్మ జ్ఞాపకార్థం గాను వారి కూతురు అల్లుడు చెన్నపాక పద్మ శ్రీనివాస్‌లు యాభై ఒక్క వేల రూపాయలను గురువారం అందజేశారు. విరాళం అందజేసిన వారిని గుడి నిర్మాణ కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో వరికుప్పల వెంకన్న, శిరస్సు రాములు, శిరస్సు ఇద్దయ్య, శిరస్సు హనుమయ్య, శిరస్సు అంజయ్య, వరికుప్పల ఎల్లయ్య, వరికుప్పల బుచ్చయ్య, బోదాసు శ్రీను, పల్లపు ప్రశాంత్, ఇరగదిండ్ల రాజు, నగేష్ పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి


చండూరులో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

చండూరు : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని బీజేపీ ఎం రాష్ట్ర నాయకుడు పిన్నింటి నరేందర్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన చండూరులో విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నకిరేకంటి లింగస్వామి గౌడ్, శ్రీను పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం

నకిరేకల్ : నకిరేకల్ పట్టణంలోని 2, 3 వార్డుల్లో బీజేపీ పట్టణ అధ్యక్షుడు పల్స శ్రీనుగౌడ్ ఆధ్వర్యంలో గురువారం ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు యన్నం వెంకటేష్, సైదులుగౌడ్, వనం వేణు, కొంపల్లి జగదీష్, ముశం శ్రవణ్, బోనగిరి వీరయ్య, యాదగిరి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


చండూరులో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

కేతేపల్లి: మండలంలోని బీమారం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ అవిరెండ్ల చినరాజాలు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. ఈమేరకు చినరాజాలు కుటుంబానికి స్థానిక ట్రాక్టర్ డ్రైవర్స్ అసోసియేషన్ తరఫున సేకరించిన రూ.30 వేలు, నిత్యావసర సరుకులను గురువారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకం నాగరాజు, పజ్జూరి గోపి, ఈట మహేష్, ఈట దాసు, సూర సైదులు, కొడిదల శ్రీరాములు, మాదాసు వెంకన్న, బెంజారపు అరవింద్ పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థి జహంగీర్‌కు ఐద్వా మద్దతు

చిట్యాల: భువనగిరి పార్లమెంటు సీపీఎం అభ్యర్థి ఎం.డి.జహంగీర్‌కు ఐద్వా మద్దతునిస్తున్నట్లు ఆ సంఘం నల్లగొండ జిల్లా ప్రధానకార్యదర్శి పాలడుగు ప్రభావతి తెలిపారు. చిట్యాలలో గురువారం జరిగిన ఐద్వా మండల కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పేద ప్రజల పక్షాన నిరంతర పోరాటం చేస్తున్న జహంగీర్‌ను పార్లమెంటు సభ్యుడిగా గెలిపించాలని కోరారు. తెలంగాణలో సీపీఎం చేసిన పోరాటాల ఫలితంగానే పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, జిల్లా కమిటీ సభ్యురాలు కృష్ణవేణి, అండాలు, ధనమ్మ, కేదార్, విజయలక్ష్మి, జానకమ్మ, నాగమణి, వరలక్ష్మి, చంద్రకళ, హేమలత పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పాలడుగు ప్రభావతి

వెలిమినేడులో ఇంటింటి ప్రచారం

మండలంలోని వెలిమినేడు గ్రామంలో భువనగిరి పార్లమెంటు సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు అరుణజ్యోతి ఇంటింటి ప్రచారం నిర్వహించి ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన చిట్యాల మండలంలో సీపీఎం అభ్యర్థి జహంగీర్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు మల్లం మహేష్, మాజీ ఎంపీటీసీ దేశబోయిన సరస్వతి, పంది నరేష్, అర్రూరీ శంభయ్య, దేశబోయిన నర్సింహ, నాగమణి, వసంత, లక్ష్మి, చంద్రకళ, యాదమ్మ పాల్గొన్నారు.

ఓటర్లకు ప్రతి సమాచారం చేరవేయాలి

మునుగోడు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్లకు ప్రతి సమాచారాన్ని వెంటనే చేరవేయాలని ఆర్‌డీఓ సుబ్రమణ్యం బీఎల్‌ఓలకు సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మండలంలోని బీఎల్‌ఓలకు పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పలు పోలింగ్ కేంద్రాల మార్పు జరిగిందని, వాటిల్లో ఓటు హక్కు కలిగిన ఓటర్లకు తెలియజేయాలని ఆదేశించారు. అంతే కాకుండా ఎన్నికల సమయానికి ప్రతి ఓటరుకు స్లిప్పులు అందించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఎం. నరేందర్, బీఎల్‌ఓలు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌డీఓ సుబ్రమణ్యం

గుత్తాకు బహిరంగ క్షమాపణ చెప్పాలి


మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు చిత్రంలో యామ దయాకర్ తదితరులు

- జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు

నల్లగొండ టూటౌన్: గుత్తా సుఖేందర్‌రెడ్డి వార్డు మెంబర్ నుంచి మూడు సార్లు ఎంపీగా, రెండు సార్లు ఎమ్మెల్సీగా, శాసనమండలి చైర్మన్‌గా ఎదిగిన మచ్చలేని నాయకుడని, దొంగనోట్లు, ఇసుక దందా, భూదందా చేసి వేలకోట్లు సంపాదించలేదని, స్థాయికి మించి ఆరోపణలు చేసిన మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు డిమాండ్ చేశారు. గురువారం నల్లగొండలోని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కనగల్ జెడ్పీటీసీ చిట్ల వెంకటేశం, బీఆర్ఎస్ నాయకులు యామ దయాకర్, అయితగాని స్వామిగౌడ్‌తో కలిసి మాట్లాడారు. ఎంతో మంది దళితులను రాజకీయాల్లోకి తీసుకువచ్చి వారిని ప్రోత్సహించారని తెలిపారు. తెలంగాణ కోసం పార్లమెంట్‌లో కొట్లాడిన సీనియర్ నేతపై అసత్య ఆరోపణలు చేయడం మంచిదకాదన్నారు. చాయి ఖర్చు లేకుండా ఎమ్మెల్సీ అయ్యాడన్న కిషోర్ మరి పైసలకు టికెట్లు అమ్ముకుంటారా అని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మునాసు వెంకన్న, బకరం వెంకన్న, హనీస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే మూసీలో వేసినట్లే

- బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య

నార్కట్‌పల్లి : బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేస్తే మూసీలో వేసినట్లే, కాంగ్రెస్ అభ్యర్థికి వేస్తే అది ఎందుకూ పనికిరాదని బీజేపీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్య అన్నారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని మాంద్ర, నార్కట్‌పల్లి, ఎల్లారెడ్డిగూడెం, మాదవ ఎడవల్లి, నెమ్మాని, అమ్మనబోలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించి మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేస్తే అభివృద్ధి జరుగుతుందన్నారు. అమ్మనబోలును మండల కేంద్రంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నార్కట్‌పల్లి నుంచి జనగాం వరకు రోడ్డు వెడల్పు చేసి ఫోర్ వే లేన్ వేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో కోమటిరెడ్డి సోదరులు మంత్రి పదవి కోసం ప్రజలు అవసరాలు తెలియని వ్యక్తిని తీసుకువచ్చి పెట్టారని, ప్రతి ఒక్కరూ ఓటు వేసే ముందు ఒకసారి ఆలోచన చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ మొగులయ్య, మండల వెంకన్న, మండల అధ్యక్షుడు కోరివి శంకర్, పాల్వాయి భాస్కర్‌రావు, మునుకుంట్ల గణేష్, నడింపల్లి శ్రవణ్, మేడబోయిన శ్రీనివాస్, వడ్డేగోని రామలింగం, నవీన్‌రెడ్డి, సంతోష్, రాజు, సత్తిరెడ్డి, విజయ్ ఉన్నారు.


నార్కట్‌పల్లి : మాట్లాడుతున్న బూర నర్సయ్య


చిట్యాల: మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

బీజేపీకి మద్దతునివ్వాలి

చిట్యాల: దేశంలో అన్ని రంగాల్లో జరుగుతున్న అభివృద్ధిని కొనసాగించేందుకు బీజేపీకి ప్రజలంతా మద్దతునివ్వాలని ఆ పార్టీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ కోరారు. చిట్యాలలో గురువారం రాత్రి జరిగిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. దేశంలోని అట్టడుగున ఉన్న పేద వర్గాల సంక్షేమానికి బీజేపీ ప్రాధాన్యతనిస్తుందన్నారు. తాను భువనగిరి పార్లమెంటు సభ్యుడుగా పనిచేసినప్పుడు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేశానన్నారు. తనకు మరోసారి అవకాశం కల్పిస్తే నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ మైల నర్సింహ, మున్సిపల్ అధ్యక్షుడు కూరెళ్ల శ్రీను, ప్రధానకార్యదర్శి గంజి గోవర్ధన్, జిల్లా నాయకులు కన్నెబోయిన మహాలింగం, పల్లె వెంకన్నగౌడ్, గుండాల నరేష్‌గౌడ్, గరిషె రవికాంత్, బోడిగె అంజయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

కార్మికులంతా కాంగ్రెస్‌కు అండగా నిలవాలి

- ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి నాగన్నగౌడ్

చిట్యాల: లోక్‌సభ ఎన్నికల్లో అన్ని వర్గాల కార్మికులంతా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి ఎరగాని నాగన్నగౌడ్ కోరారు. చిట్యాలలో గురువారం ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతే ఆర్టీసీతో పాటు వివిధ ప్రభుత్వ కార్పొరేషన్లలో పనిచేసే సిబ్బంది, పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల సంక్షేమానికి పాటుపడుతోందన్నారు. ఆటో కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం ఏడాదికి రూ.12వేల చొప్పున సాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భువనగిరి, నల్లగొండ లోక్‌సభ అభ్యర్థులైన చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కుందూరు రఘువీర్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎండీ సయ్యద్, నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కామాటి లింగయ్య, టీపీసీసీ నాయకుడు వనమాల రమేష్‌నేత, చిట్యాల మున్సిపల్ ఓబీసీ ప్రెసిడెంట్ ఎడ్ల మహాలింగం, నాయకులు కందుల విజయ్‌కుమార్, గంగారపు గణేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎరగాని నాగన్నగౌడ్

2.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

- డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు

మునుగోడు: జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 370 పీఏసీఎస్, ఐకేపీ కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 35,403 మంది రైతుల నుంచి 2,28,991 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఆయన మండలంలోని సింగారం, జమస్థాన్‌పల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను సందర్శించారు. సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిబంధన మేరకు నాణ్యమైన ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలకు తీసుకొస్తే మద్దతు ధర లభిస్తుందన్నారు. అయితే కొన్న ధాన్యానికి మొత్తం రూ.504 కోట్లు రైతులకు చెలించాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.304 కోట్లు చెల్లించామన్నారు. రైతులు దళారులను నమ్మకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఏడీపీ ఎల్లయ్య, చండూరు డీటీసీఎస్ విజయ, ఏఓ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు

రేపు నల్లగొండలో విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: నల్లగొండలో విద్యుత్ లైన్ మరమ్మతులు జరిగే ప్రాంతాల్లో ఈ నెల 27న ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటీకాలనీ, తిరుమలనగర్, మీర్‌బాగ్ కాలనీ, రాక్‌హిల్స్‌కాలనీ, శ్రీనగర్ కాలనీ ప్రాంతాల్లో కరెంట్ నిలిచిపోతుందని తెలిపారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి పోలీసులు గురువారం మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని గంగన్న పాలెం గ్రామానికి చెందిన అంబటి ప్రశాంతి కిరణ షాపులో 22 బీర్లు, 7 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.రాజు తెలిపారు.

భవన నిర్మాణ సంఘం మండల కమిటీ ఎన్నిక

శాలిగౌరారం: భవన నిర్మాణ సంఘం మండల కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గుండ్లపల్లి వెంకన్న, ఉపాధ్యక్షుడిగా పనికెర యల్లయ్య, కందుకూరి సైదులు, ప్రధాన కార్యదర్శి మాచర్ల కాంతయ్య, సహాయ కార్యదర్శులు సూరారం సైదులు, నూకబత్తిని లింగయ్య, అంకర్ల సతీష్, పొయిలపాక యల్లయ్య, కోశాధికారి ఎర్ర రాములు, కార్యవర్గసభ్యులు ఓగోటి యాదయ్య, కప్పల సోమయ్య, చింతల చెర్వు అయోధ్య, నక్కల శ్రీకాంత్, టీకుల రవి, ఊడుగు దశరథలతో పాటూ గౌరవ అధ్యక్షులుగా పెరుమాళ్ల శ్రీను, కోతి దశరథ, మన్నె సురేశ్ తదితరులు ఎన్నికయ్యారు.

ఇంటర్‌లో శ్రీ వేదాంత కాలేజీ విద్యార్థుల ప్రతిభ


వెంపల్ల శ్రావ్య


జి.మానస


దాసరి శ్రీసిరి


జి.లక్ష్మీ ప్రసన్న

నల్లగొండ: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో శ్రీ వేదాంత జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇంటర్ రెండో సంవత్సరంలో వెంపల్ల శ్రావ్య ఎంపీసీలో 1000కి 978, గుండెబోయిన మానస బైపీసీలో 975 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో దాసరి శ్రీసిరి 470కి 459, అంకిత 458, ఎస్.శిరీష 455, బైపీసీలో 440 మార్కులకు జి. లక్ష్మీ ప్రసన్న 425, జి.రేణుక 405 పొందారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, ప్రిన్సిపాల్ తోట శ్రీనివాస్‌రావు, అధ్యాపకులు రఘు, సైదులు, రాజు, నారాజు, సతీష్, శ్యామ్ అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో 'ఆల్ఫా' విద్యార్థుల ప్రభంజనం

నల్లగొండ రూరల్: ఇంటర్ ఫలితాల్లో ఆల్ఫా జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను ఆల్ఫా యాజమాన్యం గురువారం అభినందించింది. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఆంగోతు అనూష బీపీసీలో 431, ఎంపీసీలో కందుల వైష్ణవి 468, ఎరుకల శ్రీవల్లి 466, జెర్రిపోతుల శివ 465, మహ్మద్ నౌమనుద్దీన్ ఎంఈసీలో 493, హెచ్ఈసీలో పెరుమాళ్ల నిశ్చల 490, సీఈసీలో అలుగు ప్రసన్న 433, షేక్ అమీర ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్)లో 479, దాసరి శివాని ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్) 479 , చింతమల్ల ధనుష్ ఎంఎల్‌టీలో 472, సుంకరి పూజిత ఎల్ఎంఅండ్‌ డిటీలో 466 మార్కులు సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో కోరెక్క క్రాంతి ఎంపీసీలో 977, నూకల ప్రియాంక ఎంపీసీలో 968, కొమండ్లపల్లి నవ్య ఎంపీసీలో 968, నోముల పల్లవి బైపీసీలో 969, రావుల దీపిక సీఈసీలో 966, నజ్రా ఐమన్ హెచ్ఈసీలో 932, వంటిపాక నమృత ఎంపీహెచ్‌డబ్ల్యూ–ఎఫ్ 967, జటావత్ నరేష్ ఎంఎల్‌టీ 938 మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బాదిని రవికుమార్ తెలిపారు.


విద్యార్థినిని అభినందిస్తున్న ఆల్ఫా యాజమాన్యం

ఇంటర్ ఫలితాల్లో 'నారాయణ' జయభేరి


జయంతరెడ్డి


అయేషా సబహ


సంజయ్


మోద సాద్విక


అయేషా తహమీద్


సింధూర

నల్లగొండ: ఇంటర్ ఫలితాల్లో నల్లగొండలోని నారాయణ జూనియర్ కాలేజీ విద్యార్థులు జయభేరి మోగించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఆ కాలేజీ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. ఎంపీసీ జూనియర్ విభాగంలో ఎ. సంజయ్‌కుమార్, గాలి సింధూరలు 468 మార్కులు దక్కించుకున్నారు. అదే విధంగా అభిశ్రేయన్‌రెడ్డి 467, పి.హర్షిత 467, సి.స్నేహలత, పి.శ్రీజలు 467 మార్కులు పొందారు. బైపీసీ మొదటి సంవత్సరంలో అయేషా తహమీద్ 440 మార్కులకు 435, సంకు వహిని మిత్ర 433 మార్కులు దక్కించుకున్నారు. ఎంపీసీ రెండో సంవత్సరంలో జి.యశ్వంత్‌రెడ్డి 1000కు 988, జి.జయంత్‌రెడ్డి, డి.సహస్రలు 986 మార్కులు సాధించారు. బైపీసీ ద్వితీయలో ఎం. సాద్విక 986, అయేషా సబహ 985 మార్కులు పొందారు.

'పెండ్లిపాకల' బాధితులకు న్యాయం చేస్తాం

– ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ నీల

కొండమల్లేపల్లి: పెండ్లిపాకల రిజర్వాయర్ ముంపు బాధితుల సమస్యలు పరిష్కరించి న్యాయం చేస్తామని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ నీల పేర్కొన్నారు. పెండ్లిపాకల రిజర్వాయర్ ముంపు గ్రామమైన గాజీనగర్ గ్రామ పంచాయయతీ కార్యాలయంలో 109 ఎకరాలకు సంబంధించి ముంపు బాధితుల నుంచి గురువారం ఆమె దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ముంపు బాధితుల సమస్యలు తెలుసుకునేందుకు రావడం చర్చనీయాంశంగా మారింది. ఆమె వెంట నల్లగొండ ఆర్ఐ అశ్విని, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి గుండాల వెంకటయ్య తదితరులున్నారు.


వినతులను పరిశీలిస్తున్న ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ నీల

కమ్యూనిస్టుల పోరాట ఫలితమే ఉపాధిహామీ

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున

మర్రిగూడ : కమ్యూనిస్టుల పోరాట ఫలితమే ఉపాధిహామీ చట్టం వచ్చిందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఉపాధిహామీ కూలీలను కలిసి ఓట్లను అభ్యర్థించి మాట్లాడారు. 35 సంవత్సరాలుగా పేద ప్రజల కోసం అనేక పోరాటాలు నిర్వహించిన జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఉపాధి కూలీల పొట్టలు కొడుతూ నిధులకు కోత పెట్టిందన్నారు. మోదీ ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని తీసేయాలనే ఆలోచన వెనక్కి తీసుకోవాలన్నారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాంపల్లి, మర్రిగూడ మండలాల కార్యదర్శులు నాంపల్లి చంద్రమౌళి, ఏర్పుల యాదయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, రాములు, యాదమ్మ, మారమ్మ, ప్రమీల, సుధాకర్, నర్సమ్మ పాల్గొన్నారు.


ఓటర్లను అభ్యర్థిస్తున్న సీపీఎం నాయకులు

బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మర్రి శోభ


మర్రి శోభ

కేతేపల్లి: బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జిగా కేతేపల్లి మండలంలోని చెర్కుపల్లి గ్రామానికి చెందిన మర్రి శోభ నియమితులయ్యారు. ఈమేరకు ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు రాజారావు గురువారం శోభకు నియామక పత్రం అందజేశారు. ఈసందర్భంగా శోభ మాట్లాడుతూ రాష్ట్రంలో బీఎస్పీ అధికారంలోకి వస్తేనే బడుగు, బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. తన నియమకానికి సహకరించిన పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

వేసవి సెలవులు ఇవ్వాలని వినతి

నల్లగొండ రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు వేసవి సెలవులు ఇవ్వాలని కోరుతూ గురువారం మహాత్మాగాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవికి ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. యూజీసీ నిబంధనల ప్రకారం ఆరు వారాలకు తగ్గకుండా వేసవి సెలవులు ఇవ్వాలని కోరారు. ప్రస్తుత వేసవిని దృష్టిలో ఉంచుకుని, విద్యార్థులు, అధ్యాపకుల కోరిక మేరకు యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ కళాశాలలకు మే 10 నుంచి జూన్ 23 వరకు వేసవి సెలవులు ప్రకటించాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో నాయకులు మునీర్, భాస్కర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, సుదర్శన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయలు, పండ్ల చెట్లు దగ్ధం

నార్కట్‌పల్లి: ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని కూరగాయలు, పండ్ల చెట్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటన నార్కట్‌పల్లి మండల పరిధిలో గురువారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని అజీజ్ వ్యవసాయ భూమి సమీపంలో మధ్యాహ్న సమయంలో మంటలు చెలరేగి తోటకు అంటుకున్నాయి. దీంతో చెట్లు పూర్తిగా దగ్ధం కావడంతో దాదాపు రెండు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు.